క్లుప్తంగా

శ్రావణమాస పూజలు



అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో శ్రావణమాస పూజలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు దూసి శ్రీధర్ శర్మ కలశ ప్రతిష్ఠ చేసి పూజలు ప్రారంభించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో కుంకుమ పూజలు చేయించారు. నెలరోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు అర్చకులు చెప్పారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం



ట్రస్టు బోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో చేపడుతున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి పట్టణంలోని లావేరురోడ్‌కు చెందిన వారణాశి అప్పలరాజు, శారద దంపతులు రూ.50,116 ఆర్థిక సహాయం చేశారు. సోమవారం వారు తమ నివాసంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్.వి.జి. శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, దిలీప్ కుమార్ ధనూకా, గుడ్ల శ్రీనుకు నగదు అందజేశారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

గుర్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు సోమవారం పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారా లు అందిస్తోందన్నారు. విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని తాతావారి కిట్టాలి గడిగెడ్డ రిజర్వాయర్ కుడి, ఎడమగేట్లు ఎత్తి సాగునీరు విడుదల చేశారు. ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, టీడీపీ నాయకులు కె.త్రిమూర్తులురాజు, వెన్నె సన్యాసినాయుడు, టి.కిరణ్ కుమార్, ప్రిన్సిపాల్ సురేష్ పాల్గొన్నారు.

రోగులకు సక్రమంగా వైద్యసేవలందించాలి



వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీపీ ప్రమీల

గుర్ల: రోగులకు సకాలంలో, సక్రమంగా వైద్యసేవలందించాలని తెట్టంగి పీహెచ్‌సీ వైద్యసిబ్బందికి ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తెట్టంగి పీహెచ్‌సీ వైద్యాధికారులతో సోమవారం సమావేశమయ్యారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మందులు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. వైద్యాధికారి స్వప్నప్రియ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు, జమ్ము స్వామినాయుడు, అంబల్ల చిన్నారావు, జమ్ము అప్పలనాయుడు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



పేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు

జామి: హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజినిగిరి గ్రామంలో పలువురు పేదలకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రతీనెలలో మొదటివారం పేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నామని తెలిపారు. సంఘం అధ్యక్షుడు కె.సన్యాసినాయుడు, సభ్యులు కె.శ్రీనివాసరావు,టి.ప్రసాద్,కె.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాలి బాటలతో బహుళ ప్రయోజనాలు



శృంగవరపుకోట: వినాయకపల్లిలో రైతులతో కాలిబాటలు తీయిస్తున్న ఏఓ రవీంద్ర



లక్కవరపుకోట: గంగుబూడి గ్రామంలో దెబ్బతిన్న వరి నారుమడిని పరిశీలిస్తున్న ఏడీఏ విజయ



వేపాడ: దబ్బిరాజుపేటలో వరుస క్రమంలో నాట్లు వేయిస్తున్న వ్యవసాయ సిబ్బంది



గంట్యాడ: సిరిపురంలో జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

శృంగవరపుకోట: వరిపైరులో కాలి బాటలు తీయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఏఓ కె.రవీంద్ర తెలిపారు. వినాయకపల్లి గ్రామంలో రైతులకు వరి సాగులో యాజమాన్య పద్ధతులపై సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరినాట్లు పూర్తయిన 10 నుంచి15 రోజుల లోపల పొలంలో ప్రతి రెండు మీటర్ల దూరంలో 20 సెంటీ మీటర్ల వెడల్పుతో కాలిబాటలు తీసు కోవాలన్నారు. కాలిబాటలు వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి దుబ్బులకు అధిక ఆక్సిజన్ అందుతుందని, దీనివల్ల కిరణజన్య సంయోగ క్రియ బాగా జరిగి అధిక దిగు బడులు వస్తాయని, చీడపీడ లు కూడా పెద్దగా ఆశించవని వివరించారు. అలాగే ఎరువులు వేసేందుకు, క్రిమిసంహారక మందులు చల్లేందుకు, గాబు తీసేందుకు ఇబ్బంది లేకుండా, వరి దుబ్బులు తొక్కేసే పరిస్థితి లేకుండా పనులు చేసుకోవచ్చన్నారు. తూర్పు, పడమరగా కాలిబాటలు తీయ డం వల్ల వరిపైరు గాలితాకిడిని తట్టుకుని పడిపోకుండా ఉంటుందన్నారు. వీఏఏ రవి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది కోటి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లైన్‌సోయింగ్ విధానంపై అవగాహన

వేపాడ: వరిలో లైన్ సోయింగ్ (వరుస క్రమంలో నాట్లు వేసే విధానం)పై దబ్బిరాజుపేట గ్రామంలో రైతులకు వీఏఏ వంతు దేముడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మహేష్, నరేష్ సోమవారం అవగాహన కల్పించారు. రైతు ఏడువాక దేముడు నాయుడు పొలంలో ప్రయోగాత్మకంగా తాడు కట్టి వరుస క్రమంలో నాట్లు వేయించారు. పది రోజుల తర్వాత కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

దెబ్బతిన్న వరి నారుమడుల పరిశీలన

లక్కవరపుకోట: తీవ్ర వర్షాభావంతో మండలంలోని గంగుబూడి, కళ్లేపల్లి,రెల్లిగౌరమ్మపేట తదితర గ్రామాల్లో దెబ్బతిన్న వరినారు మడులను వ్యవసాయశాఖ కొత్తవలస సబ్‌డివిజన్ అధికారి ఎల్.విజయ, ఏఓ స్వాతికుమారితో కలిసి సోమవారం పరిశీలించారు. వర్షాలు లేక చాలా చోట్ల నారు ఎండిపోతున్నట్లు గుర్తించారు. నారుమడులను వర్షాభావ పరిస్థితుల నుంచి కాపాడుకునే పద్ధతులను రైతులకు వివరించారు. మల్టీకే ద్రావణాన్ని నారు పూర్తిగా తడిచేలా పిచికారీ చేసుకోవాలని సూచించారు.

జీవామృతం తయారీపై అవగాహన

గంట్యాడ: మండలంలోని సిరిపురం గ్రామంలో రైతులకు జీవామృతం తయారీపై ప్రకృతి వ్యవసాయ రీజనల్ థిమాటిక్ ఆఫీసర్ హేమసుందర్ సోమవారం అవగాహన కల్పించారు. జీవామృతంతో చీడపీడలను నివారించవచ్చని తెలిపారు. అలాగే వరిలో వరుస క్రమంలో నాట్లు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం అదనపు డీపీఏ స్వామినాయుడు, మాస్టర్ ట్రైనర్ ఈశ్వరమ్మ, యూనిట్ ఇన్‌చార్జ్‌లు ఎర్నిబాబు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు సహకారం



సాహసం ట్రస్టు దత్తత తీసుకున్న విద్యార్థినికి హామీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు ఉన్నత పాఠశాలలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు అదే గ్రామానికి చెందిన సాహసం ట్రస్టు సహకారం అందజేసింది. రూ.1.50 లక్షలతో మూడు కంప్యూటర్లు, కంప్యూటర్ టేబుళ్లు, పుస్తకాలు, పుస్తకాల ర్యాక్‌లు కొనుగోలు చేసి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చేతుల మీదుగా పాఠశాలకు సోమవారం అందజేశారు. సాహసం ట్రస్టు వ్యవస్థాపకుడు మాచారపు గణేష్‌ను అభినందించారు. అనంతరం పాఠశాలలో ఇటీవల 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థు లకు నగదు బహుమతులు అందజేశారు.అలాగే గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థిని జొన్నాడ మంగ, నర్సింగ్ విద్యార్థిని కొయ్యనేని ఉషను ట్రస్టు దత్తత తీసుకున్నట్లు ట్రస్టు వ్యవస్థా పకుడు గణేష్ తెలిపారు. వీరి చదువులకు అవసరమైన ఖర్చుతో పాటు ఉద్యోగంలో స్థిరప డేవరకు పూర్తి బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈమేరకు హామీ పత్రాలను విద్యా ర్థులకు అందజేశారు. విశ్రాంత ఎంఈఓలు సీహెచ్. కూర్మారావు, శ్రీని వాసరావు, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు కొల్లి రమణ మూర్తి, కొట్యాడ ఈశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సేవ చేయడం అదృష్టం



దివ్యాంగులకు పరికరాలు అందజేస్తున్న వై.ఎస్.ఆర్.శర్మ, శంకర్‌నారాయణ తదితరులు

కొత్తవలస: దివ్యాంగులకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని ఆంధ్రప్రభ దినపత్రిక చీఫ్ ఎడిటర్ వై.ఎస్.ఆర్.శర్మ అన్నారు. మంగళపాలెం సమీపంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్టులో 15 మంది దివ్యాంగులకు ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం కృత్రిమ అవయవాలు, బ్లైండ్ స్టిక్స్, చేతి కర్రలు అందజేశారు. ముఖ్య అతిథులుగా వై.ఎస్.ఆర్.శర్మతో పాటు హాస్యబ్రహ్మ శంకర్ నారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని అన్నారు. అనంతరం పలువురు వృద్ధులకు రేషన్ అందజేశారు. ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు, వైస్ చైర్మన్ వి.ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నైట్ డ్యూటీలు సర్వీస్ రూల్స్‌కు విరుద్ధం




వేపాడ: తహసీల్దార్ సన్యాసినాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు




కొత్తవలస: ఆర్ఐ రాజేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

వేపాడ/కొత్తవలస: సర్వీసు రూల్స్‌కు విరుద్ధంగా తమతో రాత్రిపూట తహసీల్దార్ కార్యాలయాల వద్ద డ్యూటీలు చేయించడం వెంటనే విరమిం చాలని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీఓను రద్దు చేయాలని వీఆర్‌ఏలు కోరారు. వేపాడలో తహసీల్దార్ సన్యాసినా యుడుకు, కొత్తవలసలో ఆర్ఐ రాజేష్‌కు ఆయా మండలాల వీఆర్‌ఏలు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వీఆర్‌ఏలు మాట్లాడుతూతమ సమస్యలు పరిష్కరించాలని, అర్హులైన వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇప్పించాలని, పేస్కేల్ అమలుచేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా గుర్తించాలని, ఖాళీగా ఉన్న అటెండర్,వాచ్మన్,రికార్డు సహాయకుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం



దత్తిరాజేరు:పాచలవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది



మెరకముడిదాం: సాతాంవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, వైద్యసిబ్బంది, విద్యార్థినులు

దత్తిరాజేరు: తల్లి పాలే బిడ్డ అత్యంత శ్రేష్ఠమైనవని, ఆరోగ్యవంతమైనవని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని టి.భూర్జ వలసలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలలో పోషకాలు అధికంగా ఉంటాయని, అవి బిడ్డ ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం పై అవగాహన కల్పించారు. అలాగే పాచలవలస, రామచంద్రాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ గిరిబాబు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతం

మెరకముడిదాం: తల్లిపాలు అమృతం లాంటివని, బిడ్డకు ఆరునెలల వయసు వచ్చే వరకు తల్లిపాలే పట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగమణి, మంగమ్మ, లక్ష్మి సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సాతాంవలస గ్రామంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వ హించారు. అనంతరం బాలింతలు, గర్భిణు లతో అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశమై, తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రిపాలు తాగించడం వల్ల వారిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. మెరకముడిదాం పీహెచ్‌సీ వైద్యాధికారి అజిత్‌బాబు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోండి

జామి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) కోసం 2024-25 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసు కోవాలని ఎంఈఓ-2 గంగరాజు సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. ఈ జాతీయ ఉపకార వేతనానికి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న, వార్షిక ఆదాయం రూ.3,50,000 ఉన్న కుటుంబాల విద్యార్థులే అర్హు లని తెలిపారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 6 వరకు గడువు ఉందని, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలని వివరించారు. దరఖాస్తు చేసుకున్న వారికి డిసెంబర్ 12వ తేదీన పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

ఔషధ మొక్కలు నాటుదాం

చీపురుపల్లి: ప్రతి ఒక్కరూ ఇళ్ల పెరటితో పాటు, ఖాళీ ప్రదేశాల్లో ఔషధ మొక్కలు నాటి సంరక్షించాలని ఆర్యసమాజం ప్రతినిధి కుమరపు అప్పలనాయుడు సూచించారు. వనమూలిక మొక్కల దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత్ స్వాభిమాన్ ట్రస్టు, ఆర్యసమాజం సంయుక్తంగా సోమవారం పట్టణంలోని ఆర్యసమాజం ఆవరణలో తులసి, కలబంద, తిప్పతీగ మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమూలిక మొక్కలు దివ్య ఔషధాలతో సమాన మని చెప్పారు. ఎన్నో జబ్బులు రాకుండా చేసే గుణం తులసి, కలబంద, తిప్పతీగ వనమూలికల్లో ఉన్నాయన్నారు. ఐ.రమణ, సత్యనారాయణ, ప్రకాష్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలపై దిశానిర్దేశం



హెచ్‌ఎంలకు సూచనలు చేస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8వ తేదీన నిర్వహించనున్న స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలపై హెచ్‌ఎంలకు ఎంఈఓలు జగదీశ్వరరావు, బాలభాస్కర రావు దిశా నిర్దేశం చేశారు. స్థానిక ఎమ్మార్సీలో మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా హెచ్‌ఎంలు బాధ్యత వహించాలని సూచించారు. ఎక్కడా గొడవలకు తావులేకుండా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని చెప్పారు. అనంతరం రోజువారి నిర్వహించాల్సిన ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు, ఎండీఎం నిర్వహణ, తరతర అంశాలపై సమీక్షించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు, సీఆర్ఎంటీఎస్‌లు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం



ధర్మవరం హైస్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

శృంగవరపుకోట: స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో పాఠశాలల్లో ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఏటా ప్రతీ స్కూల్‌లో ఆటల పోటీలు నిర్వహించడం విజేతలకు బహుమతులు ఇవ్వడం సాంప్రదాయంగా వస్తోంది. ధర్మవరం ఉన్నత పాఠశాలలో పీడీ శ్రీరాములు నేతృత్వంలో విద్యార్థులకు సోమవారం కబడ్డీ తదితర ఆటల పోటీలు నిర్వహించారు.

సార్వత్రిక విద్యపై ఆసక్తి ఉన్న వారిని గుర్తించండి

- ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు



బొండపల్లి: మట్లాడుతున్న ఎంపీడీఓ హరిహరరావు



జామి: కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంపీడీఓ తిరుమలరావు,ఎంఈఓ జయశ్రీ

బొండపల్లి: సార్వత్రిక విద్యావిధానంలో(ఓపెన్ స్కూల్) పదో తరగతితో పాటు ఇంటర్ చదువుకోవాలనుకునే ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తిం చి వారి వివరాలను ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు మండల అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, సచివా లయ కార్యదర్శులు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యా శాఖ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లు నిండి రాయడం, చదవడం వచ్చే వారు ఓపెన్ టెన్త్‌కు, 15 ఏళ్లు నిండి ఇంటర్ ఫెయిల్ అయిన వారు, మధ్యలో చదువుమానేసిన వారు, పదోతరగతి పూర్తి చేసిన వారు ఓపెన్ ఇంటర్ చదివేందుకు అర్హులని చెప్పారు. ఈనెల 27వ తేదీలోగా రూ.200 ఫీజును గ్రామ, వార్డు సచివాలయాలు, మీసేవా కేంద్రాల్లో కానీ, గొట్లాం ఉన్నత పాఠశాలలో కాని చెల్లించి వివరాలను ఆన్‌లైన్ చేసుకోవాలని చెప్పారు. ఎంఈఓలు కె.శోభారాణి, ఏ.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించండి

జామి: ఓపెన్ టెన్త్, ఇంటర్ విద్యపై గ్రామాల్లో అవగాహన కల్పించి, అర్హులు అడ్మిషన్‌లు పొందేలా చూడాలని ఎంపీడీఓ తిరుమలరావు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ జయశ్రీ ఆధ్వర్యంలో మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సోమవారం సమావేశమయ్యారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ చదవాలనుకునే అర్హులు ఈనెల 27వ తేదీలోగా ఫీజు చెల్లించి వివరాలు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం సంబంధిత కరపత్రాలను విడుదల చేశారు.

కొట్టాంలో వైద్య శిబిరం



శృంగవరపుకోట: వైద్యశిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న జడ్జి వాణి, తదితరులు



గజపతినగరం:శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ ప్రవర్ధన్

శృంగవరపుకోట: కొట్టాం పీహెచ్‌సీలో వైద్యాధికారి జె.హారిక ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వ హించారు. ఈశిబిరాన్ని ఎస్.కోట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయ సేవా సాధికార సంస్థ చైర్‌పర్సన్ సబ్బవరపు వాణి ప్రారంభించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ బడుగులు, బలహీను లు, పేదలకు ఆరోగ్యం అందివ్వడం సమాజం బాధ్యతని. అందుకు అన్ని వర్గాల్లో, స్థాయిల్లో ఉన్న వాళ్లంతా తగిన సహాయం అందించాలని అన్నారు. శిబిరంలో పలుగ్రామాల నుంచి వచ్చి ప్రజలతో పాటు న్యాయ వాదులకు అందించిన వైద్య సేవలను పరిశీలించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న మందులు, వేర్వేరు విభాగాలను పరిశీలించి, పీహెచ్‌సీ ద్వారా గిరిజనులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఎస్.కోట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిదేముడు, బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరంలో..

గజపతినగరం: లయన్స్ క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్, డాక్టర్ బి.ఎస్.ఆర్.మూర్తి వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు బెల్లాన లక్ష్మినరేన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం సాధారణ, నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యుడు ప్రవర్ధన్, తదితరులు 40మందికి వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే విజయనగరం ప్రేమసమాజంలో 120 మందికి భోజనాలు అందజేసి, దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు పి.టి.కుమార్, బాబి, గేదెల జగదీశ్వరరావు, బోని శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకుడు బెల్లాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణ నిధులు విడుదల చేయాలి



చీపురుపల్లిరూరల్(గరివిడి): తహసీల్దార్ బంగార రాజుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు



శృంగవరపుకోట: మండల విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు



గంట్యాడ: ఎంఈఓలు విజయకుమారి, వెంకటరావుకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు



కొత్తవలస: ఎంపీడీఓ రమణయ్యకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రభుత్వం తక్షణమే పాఠశాలలకు నిర్వహణ నిధులను విడుదల చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర బాధ్యతల నుంచి మినహాయించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు.జాతీయ విద్యావిధానం అమల్లో భాగంగా తీసుకువచ్చిన జీఓ నంబర్ 117ను రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిలబెట్టు కోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్.కోట, గంట్యాడ, కొత్తవలస, గరివిడి మండలాల్లో తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, ఎంఈఓలకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు జి.వి.రమణ,సీహెచ్. తిరుపతినాయుడు, జిల్లా నాయకుడు జి.వెంకటనాయుడు తదితరులు మాట్లాడుతూ జీఓ నంబర్117ను రద్దు చేసి, 1 నుంచి 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే నడపాలని, రాష్ట్రమంతటా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని, హైస్కూళ్లలో తెలుగు, ఇంగ్లిష్ మీడియం రెండింటినీ కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రాలు అందజేసిన వారిలో యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎస్.కోట, గంట్యాడ,కొత్తవలస, గరివిడి మండలాల కార్యవర్గ సభ్యులు,సంఘ నాయకులు ఉన్నారు.

– శృంగవరపుకోట/ గంట్యాడ/కొత్తవలస/చీపురుపల్లిరూరల్(గరివిడి)

పశు అక్రమ రవాణాను అడ్డుకోండి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ,తదితరులు

జామి: పశు అక్రమ రవాణాను సంబంధిత అధికారులు అడ్డుకోవాలని ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మహాత్మా గాంధీ విగ్రహానికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా విజయనగరం జిల్లాలో పశు అక్రమ రవాణా సాగుతోందని ఆరోపించారు.తక్షణమే అధికారులు స్పందించి దీన్ని నిలువరించాలని, బాధ్యులపై కేసులు నమోదు చేయా లని డిమాండ్ చేశారు.గోసంరక్ష సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు టి.పైడితల్లి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కె.వి.ఆర్.సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు కె.పైడితల్లి,ఎస్.ఆనంద్,మహిళా కన్వీనర్ నీలాపు దేవి పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై వినతి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఉమ్మడి జిల్లాల సీపీఎం కార్యదర్శిరాము, గిరిజనులు

దత్తిరాజేరు: షికారుగంజి పంచాయతీలోని ఎస్టీ కొత్తవలసలో కొండపై ఉంటున్న గిరిజనుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఉమ్మడి జిల్లాల సీపీఎం కార్యదర్శి వి.రాము కోరారు. గిరిజనులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ గౌరీశంకరరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గిరిజను ల కు ప్రభుత్వం ఇళ్లు మంజూరు వారు ప్రస్తుతం నివాసం ఉంటున్న చోటే నిర్మించి ఇవ్వాలని, విద్యుత్, తాగునీరు సదుపాయం కల్పించాలని, పాఠశాల ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. గిరిజనులు మర్రి శ్రీను, గమ్మెల్ల సన్యాసి, సత్యారావు, గాసి,రాము తదితరులు పాల్గొన్నారు.